ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పశ్చిమ గోదావరి
జిల్లా వార్తలు
5
మంగళవారం 2 జనవరి 2023



2024కు స్వాగతం

2024వ సంవత్సరానికి జిల్లావాసులు ఘనస్వాగతం పలికారు. ఆదివారం అర్ధరాత్రి 12 గంటలు కొట్టేసరికి.. 'హ్యాపీ న్యూ ఇయర్' అంటూ సంబరాలు చేసుకున్నారు. ఒకరికొకరు శుభాకాంక్షలు చెప్పుకున్నారు. ఈ ఏడాది అందరికి అంతా మంచే జరగాలని కాంక్షించారు.

విషాదం

నూతన సంవత్సర వేడుకలు ఆ కుటుంబాల్లో తీరని విషాదం నింపాయి. వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన ప్రమాదాల్లో ఆరుగురు వ్యక్తులు దుర్మరణం పాలయ్యారు. 7లో..



ఆలయాలు కిటకిట

కొత్త సంవత్సరంలో అంతా శుభమే జరగాలని కాంక్షిస్తూ.. తమ ఇష్ట దైవాన్ని ప్రార్థించేందుకు సోమవారం ప్రజలు ఆలయాలకు వెళ్లారు. భీమవరం మావుళ్లమ్మ ఆలయం కిటకిటలాడింది.

న్యూ ఇయర్ నిషా..

- నూతన సంవత్సర వేడుకల్లో మందుబాబుల జోరు
- కోట్లలో మద్యం అమ్మకాలు

(భీమవరం-ఆంధ్రజ్యోతి)




జిల్లాలో న్యూ ఇయర్ సంబరాలు అంబరాన్నంటాయి. డిసెంబరు 31వ తేదీ ఆదివారం సాయంత్రం నుంచి గ్రామాలు, పట్టణాల్లో సందడి వాతావరణం నెలకొంది. ఊరూరా బిర్యానీ పాయింట్లు, హోటల్స్ , బేకరీలు, మిఠాయి దుకాణాలు కిటకిటలాడాయి. ఇక మద్యం షాపులైతే మామూలుగా లేదు. మందు కోసం మందుబాబు ఎగబడ్డారు. రోజూ సగటున రూ.3 కోట్ల విలువైన జిల్లాలో మద్యం అమ్ముడయ్యేది. ఆదివారం ఒక్కరోజే ఎక్సైజ్ శాఖకు రూ.5 కోట్ల టర్నోవర్ అయ్యింది. అంటే అంత మొత్తంలో మద్యం సేవించారు. ఎప్పటిలాగే జిల్లాలో ఇతర రాష్ట్రాల బ్రాండ్‌లు తరలివచ్చాయి. అక్రమ మద్యం అమ్మకాలు జోరుగానే సాగాయి. ప్రభుత్వ మద్యం షాపుల్లో పెద్ద మొత్తంలో అమ్మకాలు జరగడంతో అధికారులు కాస్త ఊపిరి పీల్చుకున్నారు. డిసెంబరు 31వ తేదీ నుంచి రెండు రోజులపాటు అర్ధరాత్రి 12 గంటల వరకు ప్రభుత్వ షాపుల్లో అమ్మకాలకు అవకాశం కల్పించారు. పట్టణాల్లో షాపులను తెరిచే ఉంచారు. పల్లెల్లో మాత్రం పది గంటల వరకు విక్రయాలు సాగించారు. భీమవరం, తణుకు, పాలకొల్లు, నర్సాపురం, ఆకివీడులో ఆదివారం రాత్రి 12 గంటల వరకు ప్రభుత్వ మద్యం షాపులను తెరిచే ఉంచారు. తాడేపల్లిగూడెంలో మాత్రం పదిన్నరే మూసివేశారు. నియోజకవర్గ నేత ఆదేశాలతోనే మూతపడ్డాయి. బార్లలో అమ్మకాలు పెంచాలన్న ఉద్దేశంతో ప్రభుత్వ మద్యం షాపులను మూసివేసేలా నిర్ణయం తీసుకున్నారు. వాస్తవానికి బార్లలో ధరలు అధికంగా ఉంటాయి. ఒక్కో బాటిల్‌ను అదనంగా రూ.100 అధిక ధరకు విక్రయిస్తుంటారు. నాణ్యమైన మద్యం బ్రాండ్‌లు లభ్యమవుతుంటాయి. అధికార పార్టీ నాయకునికి బాటిల్‌పై రూ.10 ఇచ్చేలా బార్లతో ఒప్పందం కుదిరింది. బార్ల వేలంలోనూ సిండికేట్ అయ్యేందుకు రూ.80 లక్షలు ముట్ట చెప్పారు. నూతన సంవత్సర వేడుకల సమయంలో ప్రభుత్వ మద్యం షాపులు మూసివేయడానికి ఒక్కో బాటిల్‌పై రూ.10 ఇవ్వడానికి అంగీకరించారు. దీంతో బార్లలో వ్యాపారం పెరిగింది.

మూడు రోజులు రూ.16.50 కోట్లు

నూతన సంవత్సర వేడుకలు దగ్గరవుతున్న సమయంలో 30వ తేదీ నుంచి ఏలూరు జిల్లాలోని మద్యం షాపులు, బార్లు, లిక్కర్ స్టోర్స్‌లో రద్దీ ఎక్కువైంది. 140 మద్యం షాపులు, 16 బార్లు, 12 వాకిన్ స్టోర్స్ ఉన్నాయి. వీటికి నిడమనూరు, భీమవరం, గొల్లపూడి, ఏలూరు, చాగల్లు, గుడివాడ లిక్కర్ డిపోల నుంచి జిల్లాలో షాపులు, బార్లకు మద్యం సరఫరా అవుతోంది. రోజుకు సగటున రెండు కోట్ల 70 లక్షల రూపాయల మద్యం విక్రయాలు జరుగుతుండేవి. అయితే నూతన సంవత్సర వేడుకల నేపథ్యంలో డిసెంబరు 30న నాలుగు కోట్ల రూపాయల మద్యం విక్రయాలు జరుగగా, 31న రూ.ఆరు కోట్ల మద్యం, జనవరి 1వ తేదీన ఆరున్నర కోట్ల రూపాయల మద్యం విక్రయాలు జరిగాయి. మొత్తంగా మూడు రోజుల్లో మద్యం ప్రియులు ఏకంగా పదహారున్నర కోట్ల రూపాయల మద్యాన్ని తాగేశారు.

జాతకాలు తేల్చేద్దాం





అభ్యర్థుల ఎంపికలో వైసీపీ తుది యత్నాలు

- చింతలపూడి, పోలవరంలో కొత్త ముఖాలే
- మంత్రుల నియోజకవర్గాలపైనా సంకేతాలు
- అలిగిన కేడర్‌కు మిథున్‌రెడ్డి బుజ్జగింపు
- రాద్ధాంతం పెరగక మునుపే నేడో, రేపో స్పష్టత

అధికార వైసీపీలో జిల్లాల వారీగా వివాదం ముదరక మునుపే, పంచాయితీ వీధిన పడక ముందే, ఆవేశకావేశాలతో కార్యకర్తలు దుందుడుకుగా వ్యవహరించక ముందే నియోజకవర్గాల వారీగా పోటీ చేసే సిట్టింగ్‌లు, ఆశా వహులపై అధిష్ఠానం తుది నిర్ణయానికి రానుంది. సమన్వయకర్తలు సర్దుబాటు చేస్తున్నా, సీనియర్లు బుజ్జగిస్తున్నా ఇదిగో తమ బలమంటూ అధిష్ఠానం ముందు ప్రదర్శించేందుకు, ప్రాంతీయ సమన్వయ కర్తల ముందు అటో ఇటో తేల్చుకోవడానికి కేడర్ సిద్ధపడుతోంది. ఈ తరుణంలో కసరత్తు వేగంగా పూర్తి చేయాలని, అసంతృప్తి, ఆగ్రహాలకు కొంత కళ్లెం వేయాలని అధిష్ఠానం భావిస్తుందా అనే ప్రశ్నకు పార్టీలో అత్యధికులు అవుననే అంటున్నారు. ఇప్పటికే కొందరు సిట్టింగులను తాడేపల్లి ప్యాలెస్‌కు పిలిపించి మీకు బదులుగా వేరే వారిని రంగంలోకి దింపుతాం, ఓడిపోతారని సర్వే నివేదికలతోనే ఈ నిర్ణయం తీసుకుంటున్నామని మొహం మీదే చెప్పేశారు. అయినా ఆయా నియోజకవర్గాలపై కొందరు సిట్టింగులు తమ గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్నారు.మరికొన్నిచోట్ల మార్పులు, చేర్పులంటూ పార్టీలో ప్రచారం కొనసాగుతోంది. నేడో రేపో తుది జాబితా అంటూ అధిష్ఠానం వైపు నుంచి సంకేతాలు రావడంతో ఫ్యాను కింద ఉక్కపోత ఆరంభమైంది.

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి):

అధికార వైసీపీ నియోజకవర్గాల వారీగా మార్పులు, చేర్పులంటూ సిట్టింగులను పిలిపించి సర్దుబాటు చేద్దామనే బిగ్ ప్లాన్ బెడిసికొట్టింది. ఆ స్థానంలో అసంతృప్తి, ఆగ్రహం, పార్టీ అధ్యక్షుడు జగన్ ఆదేశాలనే నిగ్గు తేల్చేలా కేడర్ వ్యవహరిస్తుండడం పార్టీలో హాట్‌టాపిక్‌గా మారింది. అసెంబ్లీ స్థానాల్లో ఎవరిని తప్పించి, ఎవరికి మరోసారి అవకాశం ఇవ్వబోతున్నారో తేల్చుకునే నియోజకవర్గాల్లో గందరగోళం ఏర్పడింది. గడపగడపకు కార్యక్రమమే మీ భవిష్యత్తుకు గీటురాయి అంటూ సీఎం జగన్ తొలుత హెచ్చరించారు. ప్రతీ మూడు నెలలకోసారి దీనిపై సమీక్షించారు. ఎమ్మెల్యేలకు ప్లస్, మైనస్ పాయింట్లు వేస్తూ నివేదికలను వారి చేతికే అందించారు. గడపగడపలో వెనుకబడితే అసలు సీటే ఇవ్వబోమని గతేడాది ఆరంభంలోనే వార్నింగ్ బెల్ మోగించారు. అప్పట్లోనే సగం నియోజకవర్గాల్లో సిట్టింగులంతా ప్రోగ్రెస్‌ను సాధించలేకపోయారు. కొందరు నూరు శాతం పూర్తిచేసి తిరుగులేదనుకున్నారు. అలాంటి నియోజకవర్గాల్లో నరసాపురం ఒకటి. తర్వాత పార్టీ కార్యక్రమాలు విస్తృతపర్చడం, ప్రజల్లోనే ఉండాలంటూ పార్టీ ఆదేశించడంతో రెండోసారీ అనేక నియోజకవర్గాల్లో వెనుకబాటే. ఇప్పుడు అవీ ఇవీ అన్నీ కలిసొచ్చి సిట్టింగులను మార్చాలనే సర్వే నివేదికలపై వైసీపీ నాయకత్వం కుస్తీలు పడుతోంది. తొలుత చింతలపూడి, పోలవరం రిజర్వుడు నియోజకవర్గాలపై పడ్డారు. పోలవరం సిట్టింగ్ ఎమ్మెల్యే తెల్లం బాలరాజుకు మరొక మంచి 'పోస్టు' ఇస్తామంటూ చెబుతూనే ఈసారి తప్పుకోవాలని సంకేతాలు ఇచ్చేశారు.



ఇటీవల భీమవరం వచ్చినప్పుడు సీఎం జగన్‌ను కలిసిన చింతలపూడి, పోలవరం ఎమ్మెల్యేలు ఎలీజా, బాలరాజు

బాలరాజు తన సతీమణి రాజ్యలక్ష్మికి ఇవ్వాలని అధిష్ఠానానికి విన్నవించారు. ఇది జరిగి పది రోజులవుతున్నా పోలవరంలో కాక తగ్గలేదు. రాజ్యలక్ష్మి టికెట్ ఖరారైందని కొంతమంది వైసీపీ కార్యకర్తలే పెద్ద ఎత్తున సంబరాలు చేసుకున్నారు. మరోవైపు బుట్టాయిగూడెంకు చెందిన ప్రభుత్వ ఉద్యోగి అశ్విని లేదా ఆ ప్రాంత స్థానిక మహిళా ప్రజా ప్రతినిధికి అవకాశం ఇస్తారా అనేది చర్చ జరుగుతోంది. దీనిపై కొందరు ప్రాంతీయ సమన్వయకర్త మిథున్‌రెడ్డితో ఆదివారం, సోమవారాల్లో విడతల వారీగా సమావేశమయ్యారు. దీంతో ఇక బాలరాజుకు బైబై చెప్పి కీలక నిర్ణయం తీసుకునే దిశగా అధిష్ఠానం ఒక నిర్ణయానికి వచ్చినట్టు సమాచారం.

చింతలపూడిలో ఎలీజా అనుచరవర్గం.. తమ ఎమ్మెల్యేకే తిరిగి పోటీ చేసే అవకాశం ఇవ్వాలని పడుతున్నారు. మిథున్‌రెడ్డి నివాసం ఎదుట బైఠాయింపు చేశారు. గత శుక్రవారం భీమవరానికి వచ్చిన మిథున్‌రెడ్డితో ఎమ్మెల్యే ముఖాముఖి సంభాషించారు. అమలాపురం ఎంపీ స్థానానికి వెళ్లబోనని, ఆర్థిక స్తోమత సరిపోదని మనసులో ఉన్నదంతా వెల్లడించారు. ఈ విషయాలన్నీ సీఎం జగన్ దృష్టికి తీసుకువెళ్తానని మాట ఇచ్చినట్టు చెబుతున్నారు. ఆ తర్వాత భీమవరం పర్యటన సందర్భంగా సీఎం జగన్‌ను ఆహ్వానించే వారి జాబితాలో ఉన్న ఎలీజా సీఎంతో మాట్లాడారు. చింతలపూడి, పోలవరం ఎమ్మెల్యేలను మార్చేయడం, వెంటనే రెండు నియోజకవర్గాలకు సమన్వయకర్తలుగా పోటీ చేయబోయే అభ్యర్థులను ప్రకటించే దిశగా మూడు రోజులుగా వేగంగా కసరత్తు పూర్తి చేయగలిగారు. మంగళ, బుధవారాల్లో అధికారిక ప్రకటన చేయబోతున్నట్టు పార్టీ వర్గాల సమాచారం. ఇప్పటికే చింతలపూడి ఆశావహుడిగా బ్రేక్ ఇన్‌స్పెక్టర్ విజయరాజు పట్ల పార్టీ సానుకూలంగా ఉంది. ఇప్పటికే ఆయన నియోజకవర్గ ముఖ్యులు, సీనియర్లను కలిశారు. పార్టీ నుంచి గ్రీన్ సిగ్నల్ రాగానే ఉద్యోగానికి రాజీనామా చేస్తానంటున్నారు.

రెండో ప్రత్యామ్నాయం ఏదీ ?

పక్షం రోజుల్లో తాడేపల్లిగూడెం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి కొట్టు సత్యనారాయణ, కైకలూరు ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు, నరసాపురం ఎమ్మెల్యే ముదునూరు ప్రసాదరాజు, మాజీ మంత్రి, ఆచంట ఎమ్మెల్యే శ్రీరంగనాథ రాజుతో సీఎం, మిథున్‌రెడ్డి విడివిడిగా మాట్లాడారు. వీరంతా తాము కలిసింది నియోజకవర్గ సమస్యలపైనేనని, సీటు విషయంలో కాదని అనుచరుల వద్ద మాట దాటేస్తూ వచ్చారు. ఆచంట నుంచి తన కుమారుడికి ఈసారి అవకాశం ఇవ్వాలని రంగనాథరాజు కోరినట్టు, ఇదే సమయంలో రంగనాథరాజును పాలకొల్లుకు వెళ్లమన్నట్టు ప్రచారం జరిగింది. దీనిని అవునని గాని, కాదని గాని ఎవరూ స్పష్టం చేయడం లేదు. ఇంతకీ పాలకొల్లులో గుడాల గోపిని సమన్వయకర్తగా కొనసాగిస్తారా, లేదా అనేది రేపోమాపో తేల్చేయబోతున్నారు. మంత్రులు కారుమూరి, కొట్టు సత్యనారాయణ విషయంలో ఒక స్పష్టత రానుంది. చాలా చోట్ల సిట్టింగులను మార్చాలని సంకల్పించినా దీనికి తగ్గట్టుగా ఆయా నియోజకవర్గాల్లో పోటీకి ప్రత్యామ్నాయ అభ్యర్థులు దొరికే పరిస్థితి లేక వైసీపీ విలవిలలాడుతోంది. మంత్రులు కొట్టు, కారుమూరి తనయులు ఇంతకు మునుపు తమ తండ్రుల స్థానాల నుంచి పోటీ చేయాలని ఉత్సాహపడినా అప్పట్లో పార్టీ నాయకత్వం దీనికి అవునని, కాదని తేల్చేలేదు. వారి పోటీపైనా బలాబలాలను విశ్లేషిస్తూ సర్వేలు సాగించింది. కారుమూరి తణుకులో విస్తృత పర్యటనకు ప్రత్యేక కార్యక్రమం రూపొందించుకునే పనిలో పడ్డారు. రంగనాథ రాజుకు దాదాపు ఎంపీ పోటీ బెడద తప్పినట్టే. దాదాపు ఐదుగురు సిట్టింగులకు ఢోకా లేదని, తిరిగి వారే రంగంలోకి దించేందుకు సంకేతాలు ఇవ్వబోతున్నారు. ఏలూరు, భీమవరం నియోజకవర్గాల్లో ఎలాంటి మార్పు, చేర్పులు ఉండబోవని స్పష్టత ఇచ్చారు.



సంక్రాంతి స్పెషల్స్ ఫుల్



ప్రత్యేక రైళ్ల కోసం ఎదురుచూపు

నరసాపురం, జనవరి 1 : సంక్రాంతి ప్రత్యేక రైళ్ల కోసం ప్రయాణీకులు ఎదురుచూస్తున్నారు. మరో పది రోజుల్లో పండుగ వస్తున్నా ఇంత వరకు దక్షిణ మధ్య రైల్వే జిల్లా మీదుగా ఒక్క స్పెషల్ రైలును కూడా ప్రకటించలేదు. ప్రస్తుతం నడుస్తున్న రెగ్యులర్ రైళ్లన్నీ మూడు నెలల ముందుగానే నిండుకున్నాయి. నరసాపురం నుంచి నడిచే లింగంపల్లి, ధర్మవరం, నాగర్‌సోల్ ఎక్స్‌ప్రెస్‌లతోపాటు భీమవరం మీదుగా నడిచే సర్కార్, శేషాద్రి, విశాఖ, ఎల్‌టీటీ రైళ్లల్లో వెయిటింగ్ లిస్టు 150 దాటింది. పండుగ ముందు పరిస్థితి ఇలాగే ఉంది. హైదరాబాద్, బెంగళూరు, చెన్నై నుంచి జిల్లాకు వచ్చే రైళ్లు కూడా ఫుల్ అయ్యాయి. హైదరాబాద్ రైళ్లకే ఎక్కువ డిమాండ్ ఉంది. దీంతో ప్రయాణీకులంతా స్పెషల్ రైళ్ల కోసం ఎదురుచూస్తున్నారు ఇటీవల రైల్వే నరసాపురం, కాకినాడల నుంచి ఆదివారాల్లో ప్రత్యేక రైళ్లను ప్రకటించింది. పండుగ ముందు అటు హైదరాబాద్ నుంచి సంక్రాంతి తరువాత నరసాపురం, కాకినాడల నుంచి ఎటువంటి రైళ్లను వేయలేదు. దీంతో ఈ ఏడాది ప్రత్యేక రైళ్లు ఉంటాయా? లేదా అన్న సందిగ్ధం ప్రయాణికుల్లో నెలకొంది. గత ఏడాది పండుగ ముందు మూడు రోజులు హైదరాబాద్ నుంచి నరసాపురానికి ప్రత్యేక రైళ్లు నడిపారు. ఇటు తిరుగు ప్రయాణంలోనూ సంక్రాంతి తరువాత రద్దీకి అనుగుణంగా మూడు స్పెషల్ రైళ్లు వేశారు. ఈసారి ఇంత వరకు ప్రత్యేక రైళ్లపై ఎలాంటి ప్రకటన వెలువడలేదు.

ఆర్టీసీలో సందడి

భీమవరం టౌన్, జనవరి 1 : సంక్రాంతి ప్రయాణాలకు విపరీతంగా డిమాండ్ పెరిగింది. హైదరాబాద్, విశాఖ, బెంగళూరు, చెన్నై నుంచి భీమవరంతోపాటు మిగిలిన పట్టణాలకు రావడానికి దాదాపు షెడ్యూల్ బస్సుల్లో 60 శాతం సీట్లు ఇప్పటికే బుక్ అయ్యాయి. మిగతా 40 శాతం టిక్కెట్లు కూడా త్వరలో బుక్ అవుతాయని ఆర్టీసీ అధికారులు భావిస్తున్నారు. గతేడాది దసరా, సంక్రాంతి పండుగను దృష్టిలో ఉంచుకుని ఈసారి సంక్రాంతి ప్రయాణాలు భారీగా ఉంటాయని ఆర్టీసీ అధికారులు అంచనా వేస్తున్నారు. గతేడాది ప్రత్యేక బస్సులకు విశేష ఆదరణ లభించింది. మరో 4, 5 రోజుల్లో హైదరాబాద్‌కు నడిపే షెడ్యూల్ బస్సుల్లో సైతం టిక్కెట్లు బుకింగ్ నూరు శాతం పూర్తి కానున్నట్టు తెలుస్తోంది. దీంతో ఆర్టీసీ అధికారులు ఇక స్పెషల్ ఆపరేషన్‌పై దృష్టి సారించారు. నాలుగు, ఐదురోజుల్లో ప్రత్యేక షెడ్యూల్‌ను ప్రకటించే అవకాశం ఉంది. ఇక ఇతర ప్రాంతాలకు, దూర ప్రాంతాలకు షెడ్యూల్ బస్సుల్లో 60 శాతం మేర అడ్వాన్స్ రిజర్వేషన్ జరిగింది. మరోవైపు పలు రైళ్ల రద్దు ప్రభావం ఆర్టీసీ బస్సులపై పడుతోంది. మూడు నెలలుగా వరుసగా రైళ్లు రద్దవుతున్నాయి. ఈ క్రమంలో భీమవరం నుంచి హైదరాబాద్, హైదరాబాద్ నుంచి భీమవరం వచ్చే వారు చాలావరకు ఆర్టీసీ బస్సులపై ఆసక్తి చూపిస్తున్నారు. హైదరాబాద్ వెళ్ళే ప్రయాణికుల కోసం 16, 17, 18 తేదీలో అదనపు సర్వీసులను నడపనున్నారు.





నిరసన @ 21

తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జిల్లాలో అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మె సోమవారం 21వ రోజుకు చేరింది. నూతన సంవత్సరం ఆరంభమైనా అంగన్‌వాడీలు సమ్మెను కొనసాగించారు. ప్రభుత్వం కళ్లు తెరిపించాలని కోరుకుంటూ ద్వారకా తిరుమల వేంకటేశ్వరస్వామి ఆలయంలోని తొలి మెట్టు వద్ద అంగన్‌వాడీలు ప్రత్యేక పూజలు చేశారు. వీరవాసరంలో చీపుర్లతో రోడ్డు ఊడుస్తూ అంగన్‌వాడీల నిరసన(చిత్రంలో) కొనసాగించారు.

కలహాల కాపురాలు



- భార్యాభర్తల మధ్య పెరుగుతున్న మనస్పర్థలు
- అహంకారంతో విభేదాలు.. సర్దుకుపోని తత్వం
- అగమ్యగోచరంగా పిల్లల భవిష్యత్తు
- ఖర్చుకు వెనుకాడని యువజంటలు
- ఆర్థిక సమస్యలతో మనోవేదన

మాట పట్టింపులతో కాపురాలను కూల్చుకుంటున్న భార్యాభర్తల సంఖ్య ఇటీవల కాలంలో పెరుగుతోంది. తమ పిల్లల భవిష్యత్‌ను ఫణంగా పెట్టి కొట్లాటలకు దిగుతున్నారు. ఎక్కడికక్కడ సర్దుకుపోకపోవడంతో కుటుంబాలు విచ్ఛిన్నమవుతున్న ఘటనలు నిత్యకృత్యమయ్యాయి. 7లో



పెదఅమిరంలో వృద్ధురాలికి పింఛను అందిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

పెన్షన్ రూ.3 వేలు

- నేటి నుంచి ఐదో తేదీ వరకు పంపిణీ : కలెక్టర్

కాళ్ళ, జనవరి 1 : వృద్ధులు, వితంతు, ఒంటరి మహిళలు, చేనేత, కల్లు గీత కార్మికులు, ట్రాన్స్‌జెండర్లు, మత్స్యకారులు, సంప్రదాయ చర్మకారుల నెల వారీ పింఛన్‌ను ఈ నెల నుంచి రూ.250 పెంచి రూ.3000 అందజేస్తున్నట్లు కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. సోమవారం కాళ్ల మండలం పెదఅమిరంలో ఏర్పాటు చేసిన పెన్షన్ల పంపిణీలో కలెక్టర్ లబ్ధిదారులకు పింఛన్లను పంపిణీచేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో 2,36,928 మందికి రూ.69.55 కోట్ల మేర ప్రయోజనం కలగనున్నట్లు తెలిపారు. పింఛన్ల పంపిణీ కార్యక్రమం ప్రజాప్రతినిధుల సమక్షంలో 2న ఆకివీడు, పెదకాపవరం, అత్తిలి, ఇరగవరం, నరసాపురం, పాలకొల్లు అర్బన్, తణుకు, కాళ్ల, మహాదేవ పట్నం, 3న ఎల్‌బీ చర్ల, మేడపాడు, పాలకోడేరు, 4న పెనుమంట్ర, ఆచంట, పెనుగొండ, మొగల్తూరు, పాలకొల్లు, భీమవరం, తాడేపల్లిగూడెం, పెంటపాడు, పోడూరు, 5న వీరవాసరం, గణపవరంలలో అందజేయనున్నట్లు తెలిపారు. డీఆర్వో కె.శ్రీనివాసులురాజు, డీఆర్‌డీఏ పీడీ ఎస్‌వీఎస్ ప్రసాద్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఐజీగా అశోక్‌కుమార్ బాధ్యతల స్వీకరణ



ఏలూరు క్రైం, జనవరి 1: ఏలూరు రేంజ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్‌గా ఐపీఎస్ అధికారి జీవీజీ అశోక్‌కుమార్ సోమవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. డీఐజీగా వున్న ఆయనకు ఇటీవల ఐజీగా పదోన్నతి లభించింది. దీంతో ఆయన సోమవారం బాధ్యతలు చేపట్టారు. నూతన సంవత్సరం సందర్భంగా ఏలూరులోని తన కార్యాలయంలో కేక్ కట్ చేశారు. రేంజ్‌లోని ప్రజలకు, పోలీస్ సిబ్బంది అందిరికి శాంతి, శ్రేయస్సు, సంతోషం, ఉల్లాసం అందించాలని కోరుకుంటూ శుభాకాంక్షలు తెలిపారు. బాధ్యతలు చేపట్టిన ఆయనను కలిసి పలువురు పుష్పగుచ్చాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.



పాలకోడేరులో పరిశీలిస్తున్న జాస్ రాష్ట్ర కోఆర్డినేటర్ డాక్టర్ విజయలక్ష్మి, డీఎం హెచ్‌వో డాక్టర్ మహేశ్వరరావు

నేటి నుంచి జగనన్న సురక్ష-2 ప్రారంభం

భీమవరం, /పాలకోడేరు, జనవరి 1 : ప్రభుత్వం రెండోదఫా జగనన్న ఆరోగ్య సురక్ష కార్య క్రమం ఈనెల 2వ నుంచి ప్రారంభమవుతుందని జూన్ వరకు 502 క్యాంపులు, గ్రామ ఆరోగ్య క్లినిక్‌లు నిర్వహించాలని రాష్ట్ర నోడల్ అధికారి డాక్టర్ విజయలక్ష్మి చెప్పారు. వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో సోమవారం జిల్లా నోడల్ ఆఫీసర్లతో ఆమె సమీక్షించారు. హెల్త్‌క్యాంపులు నిర్వహించే ముందు రోజు అన్ని వసతులు, మందులు, ప్రభుత్వ, ప్రైవేట్ డాక్టర్ల వివరాలు సరిచూసుకోవలసిన బాధ్యత సంబంధిత వైద్యాధికారి, సూపర్‌వైజర్లదేనని చెప్పారు. వలంటీర్లు, ఆశా కార్యకర్తలు ముందుగానే ఇంటింటా సర్వే నిర్వహించి వైద్య అవసరాలున్న ప్రజలను గుర్తించి క్యాంపులలో వైద్యసేవలందే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి మహేశ్వర రావు, అదనపు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి భాను నాయక్, జిల్లా నోడల్ ఆఫీసర్ ప్రసాద్, ఇమ్యునైజేషన్ అధికారి సుధాలక్ష్మి, జిల్లా ఆరోగ్యశ్రీ కో ఆర్డినేటర్ కీర్తి కిరణ్ పాల్గొన్నారు. పాలకోడేరులో బుధవారం నిర్వహించనున్న శిబిరం ఏర్పాట్లను సోమవారం రాత్రి విజయలక్ష్మి పరిశీలించారు.

నేడు మహిళా క్రికెట్ జట్టు ఎంపిక

దెందులూరు, జనవరి 1 : ఆదికవి నన్నయ్య విశ్వ విద్యాలయం పరిధిలోని ఐదు జిల్లాలోని కాలేజీల మహిళా క్రికెట్ క్రీడాకారుల ఎంపిక దెందులూరు మండలం గోపన్నపాలెం శ్రీ సీతారామ ప్రభుత్వ వ్యాయామ కళాశాలలో మంగళవారం నిర్వహిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నతానయాల్ తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు కోయంబత్తూర్‌లో జరిగే సౌత్ ఇండియా అంతర విశ్వ విద్యాలయ పోటీలలో పాల్గొంటారని తెలిపారు.



డీవైఎఫ్ఐ సంక్రాంతి యువజనోత్సవాల పోస్టర్లు విడుదల చేస్తున్న సభ్యులు

జనవరి 9 నుంచి సంక్రాంతి యువజనోత్సవాలు

ఆకివీడు, జనవరి 1: పండుగ సమయాల్లో కోడి పందాలు, జూద క్రీడలకు దూరంగా ఉండాలని డీవైఎఫ్ఐ సంక్రాంతి యువజనోత్సవాల నిర్వహణ కమిటీ క న్వీనర్ డోకల రవితేజ, ఆహ్వాన సంఘం కోశాధికారి బి.రాంబాబు అన్నారు. సోమవారం ఆకివీడులో వారు విలేకరులతో మాట్లాడారు. డీవైఎఫ్ఐ 41వ సంక్రాంతి యువజనోత్సవాలు ఈనెల 9 నుంచి 17 వరకు దుంపగడప కళాశాల, ఆకివీడు జడ్పీ బాలురున్నత పాఠశాలలో జరుగుతాయన్నారు. యువత చెడు వ్యసనాలు వైపు పోకుండా రాష్ట్రవ్యాప్తంగా ఆటల పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. యువజనోత్సవాలకు సుమారు 800 మంది క్రీడాకారులు పాల్గొంటారన్నారు. కమిటీ సభ్యులు తవిటినాయుడు, సూరిబాబు, బొక్కా వర్మ, గేదెల రాము తదితరులు ఉన్నారు.

కేంద్ర మత్స్యశాఖ మంత్రి నేడు భీమవరం రాక

భీమవరం, జనవరి 1 : కేంద్ర మత్స్యశాఖ, పశుసంవర్థక, పాడి పరిశ్రమల శాఖ మంత్రి పర్షోత్తమ్ రూపాలా ఈనెల 2న భీమవరం రానున్నట్లు జిల్లా సమాచార శాఖ సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది.మంగళవారం సాయంత్రం 4 గంటలకు మచిలీపట్నం నుంచి రోడ్డు మార్గంలో సాయంత్రం 5-30 గంటలకు భీమవరం చేరుకుంటారు. సాయంత్రం 5-30 నుంచి 7-30 గంటల వరకు జిల్లాలోని ఆక్వా రైతులతో, ప్రాసెసింగ్ ప్లాంట్స్ ఆపరేటర్లతో ఫిష్ ఫార్మర్స్ అసోసియేషన్ భవనంలో నిర్వహించే సమావేశానికి హాజరవుతారు. రాత్రి భీమవరంలో బస చేసి, మూడో తేదీ ఉదయం బయలుదేరి కోనసీమ జిల్లా అంతర్వేదిపాలెం వెళతారని తెలిపారు.

మహిళకు అరుదైన శస్త్ర చికిత్స



తణుకు, జనవరి 1 : తీవ్రమైన కడుపు నొప్పితో బాధపడుతున్న మహిళకు తణుకు సాయిశ్వేత సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో అరుదైన శస్త్ర చికిత్స నిర్వహించారు. గణపవరం మండలం కాశిపాడు గ్రామానికి చెందిన పాలూరి నిర్మల తీవ్రమైన కడునొప్పితో ఆసుపత్రి వైద్యులను సంప్రదించగా ఎమర్జెన్సీ విభాగంలో పరీక్షలు చేసి కడుపులో కణితి ఉందని గుర్తించి వైద్యులు తక్షణమే శస్త్ర చికిత్స చేసి ఆమె కడుపులోని పదికేజీలు కణితి తొలగించారు. మహిళల్లో ఈ సమస్య ఉత్పన్నం అవుతుందని, దీనిని టోర్సన్ ఒవేరియన్ సిస్ట్ అంటారని, అండాశయ తిత్తి పెద్దదిగా మారినపుడు రక్తసరఫరా లేక అండాశయం చుట్టూ మెలితిప్పినట్లు చేస్తుందని వైద్యులు తెలిపారు. శస్త్ర చికిత్సలో ఆసుపత్రి జనరల్ సర్జన్ డాక్టర్ నిమ్మల సత్యనారాయణ, డాక్టర్లు చీర్ల నారాయణరావు, చీర్ల ఉషారాణి, బాలాజీ పాల్గొన్నారు.

కలహాల కాపురాలు





మూడు ముళ్ల బంధం మూడేళ్లు గడవకుండానే ముగిసి పోతోంది. పెళ్ళినాట ఏడడుగులు వేసిన జంటలు ఏడేళ్లు కూడా కలసి నడవలేకపోతున్నారు. నాతిచరామి అంటూ జీవితాంతం కష్టమైనా, సుఖమైనా, మంచైనా, చెడైనా కలసి నడుస్తానంటూ భర్త చేసిన తొలి వాగ్దానం తెల్లారి పోతోంది. లేనిపోని మనస్పర్థలతో విడిపోవడానికి కొత్త జంటలు సిద్ధపడుతున్నారు. సర్దుకుపోని మనస్తత్వం, అహంకారంతో వివాహ బంధానికి విలువ లేకుండా చేస్తున్నారు.

- నిడమర్రు

- భార్యాభర్తల మధ్య పెరుగుతున్న మనస్పర్థలు
- అహంకారంతో విభేదాలు..సర్దుకుపోని తత్వం
- అగమ్యగోచరంగా పిల్లల భవిష్యత్తు
- ఖర్చుకు వెనుకాడని యువ జంటలు
- ఆర్థిక సమస్యలతో మనోవేదన

పెళ్లిళ్లలో గొడవలతో ప్రారంభం

ఇటీవల కాలంలో పెళ్లిళ్లలో పెట్టిపోతలు, వియ్యాలవారి ఆతిథ్యం విషయంలో కుటుంబాల మధ్య గొడవలు మొదలవుతున్నాయి. మా వాళ్లను పెళ్లిలో మీవాళ్లు సరిగా పలకరించలేదని, ఆతిధ్యం సరిగా ఇవ్వలేదని కుటుంబ పెద్దలు, ఆడవాళ్ళు నిందలు వేసుకొంటూ గొడవలు పెట్టుకొంటున్నారు. పెళ్లిలో భోజనాలు సరిగా పెట్టలేదంటూ మొగుడు పెళ్ళాల మధ్య గొడవలు వచ్చేలా సమస్యలు సృష్టిస్తున్నారు.

అహంకారం.. అభిప్రాయ విభేదాలు

కాళ్ల పారాణి ఆరకముందే దంపతుల్లో ఒకరి అభిప్రాయాలు మరొకరికి నచ్చక మనస్పర్థలు పెంచుకొంటున్నారు. అవగాహన లేమితో అభిరుచులు, కోరికలు తేడాలు చూపిస్తూ గొడవలు సృష్టించుకొంటున్నారు. నా ఇష్టాలను గౌరవించడం లేదని భార్య, నన్ను గౌరవించడం లేదని భర్త అలిగి దూరమవుతున్నారు. బాగా చదువుకొన్నానన్న అహంకారం..నువ్వు చెప్పేది నేను వినాల్సిన అవసరం నాకేంటి ? నా సంపాదన నా ఇష్టం ? అనే మాటలు కొత్త దంపతుల మధ్య ఎక్కువగా వినపడుతున్నాయి. సర్దుకుపోని మనస్తత్వం వల్ల గొడవలు పెరిగి చివరకు విడిపోవడానికి సిద్ధపడుతున్నారు. రాజీలేని సంసారం ముందుకు సాగదన్న పెద్దలమాటను పెడచెవిన పెడుతున్నారు.



అర్థం చేసుకోలేని ప్రేమ వివాహాలు

యుక్త వయసులో ఇష్టపడి ప్రేమ వివాహాలు చేసుకొంటున్నారు. వివాహం చేసుకొనేవరకు ఎంతో ప్రేమగా ఉండే ఈ జంటలు తీరా పెళ్లి చేసుకొన్నాక ఒకరినొకరు అర్థం చేసుకోలేకపోతున్నారు. చిన్న విషయానికి కూడా అపార్థం చేసుకొంటున్నారు. ప్రేమ వివాహాలలో పెద్దల సపోర్టు లేకపోవడంతో వీరికి నచ్చచెప్పేవారు కూడా లేకుండా పోతున్నారు.

కట్నం వేధింపులు

పెద్దల కుదిర్చిన సంబంధాలలో విభేదాలకు వరకట్నం ప్రధాన కారణమవుతోంది. కట్నకానుకల విషయంలో ఇటీవల కాలంలో ధనిక కుటంబాలలో కొంత ఒత్తిడి తగ్గినా పల్లెల్లో మాత్రం ఇంకా కట్నాల పట్టింపులు ఎక్కువగా ఉన్నాయి.అడిగినంతా కట్నం ఇచ్చుకోలేక ఆడపిల్లల తండ్రులు ఎన్నో ఇబ్బం దులు పడుతున్నారు. అత్తవారింట్లో ఆడపిల్లకు వరకట్నం కోసం వేధింపులు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. ఇటీవల ఉద్యోగాల ఒత్తిడిలో గడుపుతూ సంసారాలకు దూరం అవుతున్నారు. కాలం గడిచేకొద్ది పిల్లల పుట్టడం లేదంటూ నిందలు వేసుకొంటూ విడిపోతున్నారు.

దూరం చేస్తున్న వ్యసనాలు

పెళ్లికి ముందు మా కుర్రోడు చాలామంచోడంటూ పెళ్లి చేస్తున్నారు. తీరా పెళ్లయ్యాక అతని అలవాట్లు తెలిసి ఆడపిల్లవారు బిత్తరపోవాల్సిన పరిస్థితి ఉంటోంది. ప్రతిరోజు తాగి ఇంటికి వచ్చే భర్త ఆగడాలు భరించలేక ఆడపిల్లలు పుట్టింటికి పరుగులు పెడుతున్నారు. గొడవలు పడి సంబంధాలు తెంచుకొంటున్నారు. ఉద్యోగాల పేరుతో బయటకు వస్తున్న భార్యభర్తలు ఉద్యోగ ప్రాంగణంలో వేరేకరితో ఏర్పడిన పరిచయాలు వివాహేతర సంబంధాలకు దారితీస్తున్నాయి. దీంతో కాపురాలు కూలుతున్నాయి.

పెరుగుతున్న ఆర్థిక సమస్యలు

కొత్తజంటలు ఖర్చుకు వెనకాడడం లేదు. రెండు చేతులా సంపాదిస్తున్నాం మా ఇష్టం అంటూ ఆర్థిక సమతుల్యం లేకుండా ఖర్చుచేస్తుండడంతో చివరకు ఆర్థిక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారు. కార్పరేట్ ఉద్యోగాల ఒక్కసారిగా పింక్ కార్డుతో చెల్లుచీటి ఇవ్వడంతో ఈఎంఐల భారంతో ఘర్షణలు పెరుగుతున్నాయి. ఇటు వ్యవసాయం, వ్యాపారం, ఆక్వా రంగాలు కూడా పూర్తి దెబ్బ తినడంతో ఆర్థిక సమస్యలతో నలిగిపోయి దూరమవుతున్నారు.

అగమ్యగోచరంగా పిల్లల భవిష్యత్తు

తమ అహంభావంతో పచ్చని కాపురంలో చిచ్చులు పెట్టుకొంటూ సంసారాన్ని పాడుచేసుకొంటున్నారు. వీరి చేస్తున్న తప్పులు వారి పిల్లలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. విడిపోయిన భార్యభర్తలు తమ సంతానం విషయంలో వంతులు వేసుకొని ఆ బిడ్డలకు తండ్రినో, లేక తల్లినో లేకుండా చేస్తున్నారు. అమ్మమ్మ, నాయనమ్మల వద్ద పెరుగుతూ తల్లిదండ్రుల ప్రేమలకు దూరమవు తున్నారు. వారి చదువుల విషయంలో సరైన నిర్ణయాలు చేయక తమతో పాటు పిల్లల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టివేస్తున్నారు.

చంద్రబాబుకు శుభాకాంక్షలు



భీమవరం టౌన్, జనవరి 1 : పశ్చిమ గోదావరి జిల్లా టీడీపీ అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి సోమవారం చంద్రబాబునాయుడును హైదరాబాదులోని ఆయన నివాసంలో సోమవారం కలిసి పుష్పగుచ్ఛంతో నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఆమెతో పాటు కుమార్తె, నీలోఫర్ హాస్పటల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఉషారాణి శుభాకాంక్షలు తెలియజేశారు.

రేపటి నుంచి త్యాగరాజ ఆరాధనోత్సవాలు



భీమవరం టౌన్, జనవరి 1 : త్యాగరాజ మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో ఈనెల 3నుంచి 8వ తేదీ వరకు 105వ త్యాగరాజ ఆరాధనోత్సవాలు, త్యాగరాజ స్వామి 176 వర్ధంతి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు చెరుకువాడ వెంకట్రామయ్య, రంగసాయి, కారు మూరి చినబాబు తెలిపారు. 3 ఉదయం 8-30 గంటలకు స్వామివారి ఊరేగింపు, సాయంత్రం 6-30 నిమిషాలకు సురేంద్రనాథ్ బృందం నృత్యంతో ఉత్సవాలు ప్రారంభమ వుతాయి. 6న ఉదయం 10 గంటలకు శ్రీత్యాగరాజ స్వామివారి పంచరత్న కీర్తనలు, సాయంత్రం 6-30 గంటలకు బెంగళూరు బ్రదర్స్‌వారిచే గాత్రం, 7న జంధ్యాల కృష్ణకుమారి బృందం హరికథ, 8న పోపూరి గౌరినాధ్ బృందం పాహిరామప్రభో సంగీత రూపకం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. హైదరా బాద్, బెంగళూరు విశాఖపట్నం, చెన్నై నుంచి సంగీత విద్వాంసులు వస్తున్నారని తెలిపారు.

ఆలయాలకు భక్తుల తాకిడి

ద్వారకాతిరుమలలో రద్దీ

ద్వారకాతిరుమల, జనవరి 1: ద్వారకాతిరుమల ఆలయం న్యూ ఇయర్ సందర్భంగా జిల్లాలోని వివిధ ఆలయాలకు భక్తులు పోటెత్తారు. ప్రసిద్ధ ఆలయాల భక్తులతో కళకళలాడాయి పురస్కరించుకుని సోమవారం భక్తులతో కిటకిట లాడింది. నూతన సంవత్సరం తొలిరోజున స్వామిని దర్శించాలన్న ఆకాంక్షతో ఆది వారం సాయంత్రానికే ఇతర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాదయాత్రగా విచ్చేశారు. తెల్లవారుజాము నుంచి వచ్చిన భక్తులతో క్షేత్రంలో సందడి నెలకొంది. ఆలయంలోని అన్ని విభాగాలు భక్తులతో నిండాయి.



తిరువీధుల్లో శ్రీవారు, అమ్మవార్ల గ్రామోత్సవం

నేత్రపర్వం..ధనుర్మాస ఉత్సవం



శ్రీదేవి, భూదేవి సమేత గోదాదేవితో కలసి చిన వెంకన్న తొళక్కవాహనంపై సోమవారం ఉదయం క్షేత్ర పురవీధుల్లో ఊరేగారు. ధనుర్మాస ఉత్సవాలను పురస్కరించుకుని ముందుగా ఆలయ ఆవరణలో తొళక్కం వాహనంపై శ్రీవారు, అమ్మవార్లతో పాటు గోదాదేవి ఉత్సవ మూర్తులను ఉంచి అర్చకులు ప్రత్యేక అలంకరణ చేశారు. మేళతాళాల నడుమ పురవీధుల్లో ఊరేగించారు.క్షేత్ర తిరువీధుల్లో ప్రత్యేక అలంకరణలో ఉన్న గజలక్ష్మిని సందర్శించిన భక్తులు దానికి పళ్లు, చెరకు ముక్కలు అందించి ఆశీర్వాదం పొందారు.

భీమవరం మావుళ్ళమ్మ ఆలయం కిటకిట

భీమవరం టౌన్ : కొత్త సంవత్సరం అంతా శుభాలు కలగాలని కోరుకుంటూ పట్టణంలో భక్తులు మావుళ్ళమ్మ అమ్మవారిని దర్శించుకోవటానికి రావటంతో ఉదయం నుంచీ ఆలయం కిటకిటలాడింది. ఆలయాన్ని పూలతో ప్రత్యేకంగా అలంకారం చేశారు. తెల్లవారుజాము నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు రద్దీ కొనసాగింది. భక్తులకు ఇబ్బందులు రాకుండా ఈవో భద్రాజీ పర్యవేక్షించారు. సోమేశ్వరస్వామి ఆలయం, సోమేశ్వరస్వామి, దాసాంజనేయస్వామి ఆలయాలు భక్తులతో కళకళాడాయి.

క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో..



పాలకొల్లు టౌన్ : క్షీరారామంలో సోమవారం భక్తులు పోటెత్తారు. ఉదయం నుంచీ భక్తులు క్యూకట్టి స్వామిని దర్శించుకున్నారు. స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఛైర్మెన్ కోరాడ శ్రీనివాసరావు, ఈవో యాళ్ల సూర్య నారాయణ ఏర్పాట్లును పర్యవేక్షించారు.

ఏలూరులో హత్య..మృతుని గుర్తింపు

ఏలూరు క్రైం, జనవరి 1 : ఏలూరు నగరంలో పాత బస్టాండ్ సమీపంలో డిసెంబర్ 31వతేదీ అర్ధరాత్రి జరిగిన హత్యలో మృతుడిని గుర్తించారు. ఏలూరు కత్తేపువీధి ప్రాంతానికి చెందిన ఒడ్డిగళ్ళ మధు (30) బార్బర్ పనిచేస్తూ జీవిస్తున్నాడు. అతని భార్యతో గొడవ జరిగి ప్రస్తుతం ఒంటరిగా ఉంటున్నాడు. ఏలూరు బావిశెట్టివారిపేటనకు చెందిన పెయింటర్ కనుమటి హరికుమార్ (35)తో అప్పుడప్పుడు కలిసి మద్యం తాగుతూ ఉంటాడు. వీరిద్దరు డిసెంబరు 31 రాత్రి ఏలూరు పాతబస్టాండ్ సమీపంలోని ఒక బార్‌లోకి వెళ్లి మద్యం తాగుతూ ఉండగా వారి మధ్య గొడవ జరిగింది. ఇంటికి వెళ్తున్న మధుపై హరికుమార్ చాకుతో దాడి చేసి హతమార్చాడు. ఈ ఘటనపై టూటౌన్ సీఐ ప్రభాకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు సమాచారం. హత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.

యలమంచిలిలో ఇంట్లో చోరీ

యలమంచిలి, జనవరి 1: యలమంచిలి గ్రామం గొలేపరచెరువు గట్టు ప్రాంతంలో తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగింది. గొలేపరచెరువు గట్టు ప్రాంతానికి చెందిన రిటైర్డ్ ఉద్యోగి కవురు విష్ణుమూర్తి తన ఇంటికి తాళం వేసి పెనుగొండ మండలంలో ఉన్న తన కుమార్తె ఇంటికి రెండు రోజుల క్రితం వెళ్లారు. అప్పటి నుంచి ఇంట్లో ఎవరూ లేరు. ఆ ఇంటి వెనుక తలుపులు తెరిచి ఉండటాన్ని ఇరుగు పొరుగువారు సోమవారం ఉదయం గమనించారు. ఫోన్‌లో విష్ణుమూర్తికి సమాచారం అందించారు. దీంతో చోరీ ఎప్పుడు జరిగిందో తెలియదు కానీ సోమవారం విషయం బయటపడింది. భారీగా బంగారం, నగదు అపహరణకు గురైనట్టు సమాచారం.

న్యూ ఇయర్ విషాదం

వేర్వేరు ప్రమాదాల్లో ఆరుగురి మృతి

నూతన సంవత్సర వేడుకలు ఆ కుటుంబాల్లో తీరని విషాదం నింపాయి.. వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన ప్రమాదాల్లో ఆరుగురు మృతిచెందారు.



రోడ్డు పక్కన ఉన్న సిమెంటు దిమ్మను ఢీకొన్న మోటారు సైకిల్

ఏలూరులో మోటారు సైకిల్ అదుపుతప్పి.. ఇద్దరు యువకుల మృతి

ఏలూరు క్రైం, జనవరి 1 : హైస్పీడ్ మోటారు బైక్‌పై అర్ధరాత్రి వేళ అతి వేగంగా వెళుతూ రోడ్డు పక్కనే సిమెంటు దిమ్మను ఢీకొట్టిన ప్రమా దంలో ఇద్దరు యువకులు మృతి చెందారు. ఏలూరు కుమ్మర రేవుకు చెందిన తేళ్ళ వెంకట సుబ్రమణ్యం (17) ఇంటర్మీడియట్ చదివి ఇంటి వద్దే ఉంటున్నాడు. అతని స్నేహితుడైన ఏలూరు కొత్తపేటకు చెందిన మీసాల వేణుసాయి మాధవ్ (17) బీటెక్ చదువుతున్నాడు. వీరిద్దరు డిసెంబరు 31 రాత్రి మోటారు సైకిల్‌పై ఏలూరు మినీ బైపాస్ రోడ్డులో నూతన సంవత్సర వేడుకలను జరుపుకుని అక్కడ నుంచి వట్లూరు హౌసింగ్ బోర్డు కాలనీకి వెళ్తూ మినీ బైపాస్ రోడ్డులో పక్కనే హెచ్చరికగా ఉన్న సిమెంటు దిమ్మను ఢీకొట్టారు. దీంతో ఆ దిమ్మ విరిగి పోయింది. ప్రమాదంలో ఇద్దరికీ తీవ్ర గాయాలవగా విజయవాడ తీసుకు వెళ్ళారు. అక్కడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందు తున్న సుబ్రహ్మణ్యం మధ్యాహ్నం మృతి చెందగా, ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం సాయంత్రం మాధవ్ మృతి చెందాడు. నూతన సంవత్సర వేడుకలు ఆ రెండు కుటుంబాలకు తీరని విషాదాన్ని నింపింది. ఏలూరు త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డివైడర్‌ను ఢీకొట్టిన బైక్..ఒకరి మృతి..





దెందులూరు, జనవరి 1 : నూతన సంవత్సరం మొదటి రోజు విషాదం నెలకొంది. 16వ నంబరు జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. ఇద్దరికి తీవ్రగాయాల య్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సోమవారం తెల్లవారు జామున 3 గంటల సమయంలో భీమడోలు మండలం గుండుగొలను గ్రామా నికి చెందిన గంటా బాలు (18) మరో ఇద్దరు యువకులు మోటార్ సైకిల్‌పై జాతీయ రహదారి మీదుగా దెందులూరు వైపు వెళ్తున్నారు. మోటార్ సైకిల్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొనడంతో బాలు అక్కడికక్కడే పడి మృతి చెందాడు. మరో ఇద్దరు నత్తా వంశీ, కొవ్వలి సురేష్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. గాయ పడిన వారిని స్థానికులు అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు. దెందు లూరు పోలీసులు కేసు నమోదు చేశారు.

పెంటపాడులో పంటబోదెలో పడి ఒకరు..



పెంటపాడు, జనవరి 1 : నూతన సంవత్సర వేడుకలను స్నేహితులతో కలసి చేసుకునేందుకు వచ్చిన యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెం దాడు. భీమడోలు మండలం వడ్లపట్ల గ్రామానికి చెందిన భీమవరపు రామకృష్ణ (33) వ్యవసాయ కూలీగా జీవనం సాగిస్తున్నాడు. నూతన సంవత్సరం వేడుకల కోసం ఆదివారం సాయంత్రం పెంటపాడు మండలం కే.పెంటపాడులో ఉన్న తన స్నేహితులను కలిసేందుకు వచ్చాడు. రాత్రి మోటర్ సైకిల్‌పై తన స్వగ్రామం వెళ్తున్న సమయంలో పెంటపాడు మూలతూం వద్ద ఉన్న కల్వర్ట్‌ను ఢీకొట్టి పక్కనే ఉన్న పంటబోదెలో పడిపోయాడు. తలకు బలమైన గాయం అవడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఎస్.ఐ హరికృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్రైం కార్నర్



బావిలోకి దూసుకెళ్లిన బుల్లెట్.. ఇద్దరు దుర్మరణం

ఆగిరిపల్లి, జనవరి 1: విజయవాడలోని నున్నకు చెందిన శెట్టి సాయి కుమార్, నున్న రాకేష్ స్నేహితులు. నూతన సంవత్సరం సందర్భంగా రాకేష్ సమీప బంధువు అయిన ఏలూరు జిల్లా ఆగిరిపల్లి మండలం కనసానపల్లిలో వేడుకలు జరుపు కునేందుకు తమతో పాటు విజయవాడ మొగల్రాజపురానికి చెందిన తలశిల కృష్ణచైతన్యను తీసుకువెళ్లారు.పార్టీ అనంతరం సోమవారం ఉదయం ఇళ్లకు బయల్దేరారు. బుల్లెట్‌పై వెళుతున్న వీరికి గేదెలు అడ్డు రావడంతో పక్కకు వెళ్ళేప్రయత్నంలో పక్కనే ఉన్న నేలబావిలోకి వీరి బైక్ దూసుకు పోయింది. వీరి వెనుకే వస్తున్న మరో ఇద్దరు ఇది చూసి పొలంలో పనిచేస్తున్న వారికి సమాచారం ఇవ్వడంతో వారు కర్ర సాయంతో రాకేష్‌ను బావి నుంచి బయటకు తీసి చికిత్స నిమిత్తం విజయవాడ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. కృష్ణచైతన్య (24), శెట్టి సాయికుమార్ (24) బావిలోనే మృతి చెందారు. పోలీసులకు సమాచారం అందడంతో మృతదేహాలను బయటకు తీయించారు. ఎస్సై చంటిబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సాయికుమార్, కృష్ణచైతన్య ఇప్పుడిప్పుడే ఉద్యోగాల్లో స్థిరపడుతూ కుటుంబాలకు ఆసరాగా నిలుస్తున్నారు.వీరిని నేలబావి పొట్టన పెట్టుకోవడంతో వారి తల్లిదండ్రుల ఆవేదనకు అంతులేదు.

వైద్య ఉద్యోగి ఆత్మహత్యాయత్నం

లింగపాలెం, జనవరి 1: లింగపాలెంలో ప్రభుత్వ ఆసుపత్రిలో ఎస్ఎన్‌వోగా పని చేస్తున్న రాజేశ్వరి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. సోమవారం ఉదయం విధులకు హాజరైన ఆమె ఆసుపత్రిలోనే అపస్మారక స్థితిలోకి వెళ్ళడంతో గుర్తించిన సిబ్బంది ఆమెకు ప్రాథమిక చికిత్స జరిపి చింతలపూడిలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యసేవల నిమిత్తం ఏలూరులోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

జగన్ మనసు మార్చండి..

▸▸ వైఎస్ విగ్రహానికి అంగన్‌వాడీల వినతి



ఆకివీడులో వైఎస్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీలు



భీమవరంలో నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

భీమవరం అర్బన్, జనవరి 1 : సీఐటీయు ఆధ్వర్యంలో అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ చేపట్టిన సమ్మె సోమవారం 21వ రోజు కొనసాగింది. జగన్ మనసు మార్చాలంటూ అంగన్వాడీ లు వైఎస్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. యుటీఎఫ్ జిల్లా అధ్యక్షులు ప్రధాన కార్యదర్శి రామభద్రం, విజయరామరాజు మద్దతు తెలిపారు. శ్రీనివాస్, కళ్యాణి, విజయలక్ష్మి, పట్టాభి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

● ఆకివీడు: తమకు మీరైనా న్యాయం చేయాలంటూ అంగన్‌వాడీలు మెయిన్ సెంటర్‌లో రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి వినతిపత్రం అందజేశారు.సమస్యలు పరిష్కారం అయ్యేవరకు సమ్మె కొనసాగిస్తామని అన్నారు. సీఐటీయూ నేత కె. తవిటినాయుడు ఉన్నారు.

● తణుకు: తమ సమస్యలు పరిష్కరించాలంటూ ఆర్పీరోడ్డులో వైఎస్ విగ్రహానికి అంగన్‌వాడీలు వినతిపత్రం సమర్పించారు. తెలంగాణ కన్నా అదనంగా జీతాలు చెల్లిస్తామని హామీ ఇచ్చి మాట తప్పారని ఆవేదన వ్యక్తం చేశారు. సీఐటీయూ నేత కామన మునిస్వామి, వసంతకుమారి, ప్రమీల, దుర్గాదేవి, రోజా తదితరులు పాల్గొన్నారు.

● నరసాపురం టౌన్: స్టీమర్ రోడ్‌లోని వైఎస్ విగ్రహం వద్దకు నినాదాలు చేస్తూ అంగన్‌వాడీలు తరలివచ్చారు. జగన్‌కు కలలో కనిపించి పాదయాత్రలో ఇచ్చిన హామీలను అమలు చేయించాలని వేడుకున్నారు. తొలుత అంబేడ్కర్ సెంటర్‌లో కొద్దిసేపు దీక్షలో కూర్చున్నారు. త్రిమూర్తులు, రాము పాల్గొన్నారు.

● మొగల్తూరు: వైఎస్ విగ్రహానికి అంగన్‌వాడీలు వినతిపత్రం అందజేశారు. సమస్యలు పరిష్కరించకపోతే ఎన్నికల్లో సత్తాచాటుతామన్నారు. సీఐటీయూ జిల్లా నాయకుడు తెలగంశెట్టి సత్యనారాయణ, యడ్ల చిట్టిబాబు, ఆదూరి సాంబమూర్తి, జట్టు కార్మికులు సంఘీభావం తెలిపారు.

జ్ఞానోదయం కలిగించండి..

● పెనుగొండ: జగన్‌కు జ్ఞానోదయం కలిగించండంటూ వైఎస్ విగ్రహానికి అంగన్‌వాడీలు వినతిపత్రం అందజేశారు. తొలుత శిబిరం నుంచి ప్రదర్శనగా కాలేజీ సెంటర్‌లో ఉన్న వైఎస్ఆర్ విగ్రహం వద్దకు చేరుకున్నారు. కె. తులసి, ఎం. నాగేశ్వరరావు, నాగిశెట్టి గంగారావు, ఎస్. వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

● వీరవాసరం : సమస్యలు పరిష్కరించకపోతే ప్రభుత్వాన్ని తుడిచి వేయటం ఖాయమని అంగన్‌వాడీలు నినదించారు. చీపురు పట్టి రోడ్లు ఊడుస్తూ సోమవారం నిరసన వ్యక్తం చేశారు. సీఐటీయూ జిల్లా నాయకులు ఎం. ఆంజనేయులు మాట్లాడుతూ, సమస్యలు పరిష్కరించుంటే గుణపాఠం తప్పదని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. నాగరత్నం, బి సత్యవతి, శాంతికుమారి, వెంకటలక్ష్మీ, నాగపార్వతి, బొబ్బనపల్లి సూర్యచంద్రరావు పాల్గొన్నారు.



గణపవరంలో..

● గణపవరం: మహిళలను కంటతడి పెట్టిస్తున్న జగన్‌కు కనువిప్పు కలగించాలంటూ సరిపల్లెలోని వైఎస్ విగ్రహానికి అంగన్వాడీలు వినతిపత్రం సమర్పించారు. ఝాన్సీ, రామకోటి, జయలక్ష్మీ, వెంకటలక్ష్మీ, మహాలక్ష్మి పాల్గొన్నారు.

● పెనుగొండ: జగన్‌కు జ్ఞానోదయం చేయాలంటూ అంగన్‌వాడీలు వైఎస్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. తొలుత ప్రదర్శనగా మెయిన్ రోడ్డు గుండా కాలేజీ సెంటర్‌లో ఉన్న వైఎస్ఆర్ విగ్రహం వద్దకు చేరుకున్నారు. కె. తులసి, సీఐటీయు నాయకులు మాదాసు నాగేశ్వరరావు, నాగిశెట్టి గంగారావు, ఎస్. వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



తణుకులో నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించండి

తణుకు, జనవరి 1: తమ సమస్యలు పరిష్కరించాలంటూ మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వీరి సమ్మె సోమవారం ఆరో రోజుకు చేరింది. సీఐటీయూ జిల్లా కార్యదర్శి పీవీ ప్రతాప్ మాట్లాడుతూ సమస్యల పరిష్కరించకుంటే సమ్మెను ఉధృతం చేస్తామన్నారు. మునిస్వామి,ఆదినారాయణ, కృష్ణబాబు, సత్యనారాయణ పాల్గొన్నారు.



చెవిలో పువ్వులు పెట్టిన నిరసన తెలుపుతున్న కార్మికులు

చెవిలో పువ్వులతో నిరసన

భీమవరంటౌన్, జనవరి 1 : జేఏసీ ఆధ్వర్యంలో మున్సిపల్ ఆఫీస్ వద్ద మున్సిపల్ కార్మికులు చెవులో పువ్వులు పెట్టి నిరసన తెలిపారు. ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ సంఘీభావం తెలిపా మాట్లాడారు. కరోనా సమయంలో మున్సిపల్ కార్మికులు చేస్తున్న సేవలను వెలకట్టలేమని ప్రకటించిన సీఎం జగన్ తాను అసెంబ్లీ సాక్షిగా ఇచ్చిన హామీలు ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. బి. వాసుదేవరావు జి.నాని ఎం. రాజు ధనలక్ష్మి, బంగారు మరియమ్మ, పద్మ వరలక్ష్మి, ఎస్.విశ్వనాథం, నేలపు అప్పన్న, ఆకుల సత్యనారాయణ, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

గణనాథుడికి అభిషేకాలు..



పోడూరు, జనవరి 1: చింతలతోటలో వేంచేసియున్న వినాయక స్వామిని సోమవారం భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు. వినాయకుడికి అభిషేక పూజలు, గరిక పూజలు నిర్వహించారు. ఈశాన్యం చింతలతోట వినాయకుడికి భక్తులు పూజాధికార్యక్రమాలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. పెనుమదంలోని ధనుర్మాస ఉత్సవాలు పురష్కరించుకుని శ్రీసీతారామస్వామి వార్లకు ఊరేగింపు ఉత్సవం నిర్వహించారు.

గ్రామదేవతలకు కుంకుమ పూజలు

పోడూరు, జనవరి, 1: గ్రామదేవతలు గరగలమ్మ, వెలగలమ్మ అమ్మవార్లకు సోమవారం మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయాలకు భక్తులు పోటెత్తారు. కొత్తదంపతులు అమ్మవార్లను దర్శించుకుని దీపధూపాలతో చలివిడి పానకాలు పోసి నైవేదాద్యలు చెల్లించారు.

దర్శిపర్రులో పుంతలమ్మ జాతర ప్రారంభం

పెంటపాడు, జనవరి 1: దర్శిపర్రులో పుంతలమ్మ ముసలమ్మ జాతర సోమవారం ఘనంగా ప్రారంభమైంది. గ్రామస్థులు అమ్మవారికి చలివిడి, పానకం నైవేద్యంగా సమర్పించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు బారులు తీరారు. సాయత్రం శక్తివేషాలు, మేళ తాళాలతో అమ్మవారిని ఘనంగా ఊరేగించారు. ఆలయ కమిటీ ఏర్పాట్లను పర్యవేక్షించింది.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెంటపాడు, జనవరి 1: విద్యుత్ మరమ్మతుల కారణంగా మంగళవారం మండలంలోని ముదునూరు, ఆకుతీగపాడు, ముక్కేపురం, రావిగుంట గ్రామాల్లో ఉదయం ఎనిమిది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు డీఈ ఎస్.వెంకటేశ్వరరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.







ఉండి ఎమ్మెల్యే మంతెన రామరాజుకు, పాలకొల్లులో మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్‌కు అభిమానుల శుభాకాంక్షలు.. బలుసులమ్మ సన్నిధిలో బొలిశెట్టి

ప్రజానేతలకు శుభాకాంక్షల వెల్లువ

కాళ్ళ, జనవరి 1 : మండలంలో నూతన సంవత్సర వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉండి ఎమ్మెల్యే మంతెన రామరాజు, మాజీ ఎమ్మెల్యే వేటుకూరి వెంకట శివరామరాజులకు నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున టీడీపీ, జనసేన శ్రేణులు, అధికారులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. డీసీసీబీ ఛైర్మన్ పి.వి.ఎల్. నరసింహరాజు, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ పాతపాటి శ్రీనివాసరాజులకు అభిమానులు పూల బొకేలు, కేకులు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. కేక్ కట్ చేసి పంపిణీ చేశారు.

● నరసాపురం: కొత్త సంవత్సరాన్ని తీరంలో ఘనంగా జరుపుకున్నారు. బంధువులు, స్నేహితులకు న్యూ ఇయర్ శుభాకాంక్షలు తెలిపారు. కేకులు కట్ చేసి పంచిపెట్టారు. ఉద్యోగులు, రాజకీయా నాయకుల ఇళ్ల వద్ద సందడి కనిపించింది. ఆర్డీవో ,డీఎస్పీ, కమిషనర్, తహసీల్దార్, డీఎల్‌పీవో, ఎంపీడీవో, సర్కిల్ కార్యాలయం, ఆర్టీసీ, రైల్వే ఎస్ఎంలకు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు, మాజీ మంత్రి కొత్తపల్లి, మాజీ ఎమ్మెల్యే బండారు, ఇన్‌ఛార్జి పొత్తూరి, జనసేన కన్వీనర్ బొమ్మిడి నాయకర్, చాగంటి చిన్నలకు వారివారి నివాసాల వద్ద అభిమానులు, కార్యకర్తలు, నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. లూథరన్, బెతస్థ, పెంతికోస్తు, జీవన్‌జ్యోతి, జీడీఎం, మండలంలోని సరిపల్లి, లిఖితపూడి, చిట్టవరం, కొప్పర్రు, సీతారాంపురం, కొత్త నవరసపురం చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

● ఆచంట: న్యూ ఇయర్‌కు స్వాగతం పలుకుతూ తమ తమ ఇళ్ల వద్ద రంగుల ముగ్గులు వేశారు. ఒకరికొకరు శుభాకాంక్షలు చెప్పుకున్నారు. ఎమ్మెల్యే రంగనాధరాజు తూర్పుపాలెం క్యాంప్ కార్యాలయం వద్ద కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అధికారులు , ప్రజా ప్రతినిధులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. జెడ్‌పీటీసీ ఉప్పలపాటి సురేష్‌బాబు, ఎంపీపీ దిగుమర్తి సూర్య కుమారిలకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

● పెనుగొండ: మండలంలో నూతన సంవత్సర వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఇళ్ల ముందు రంగులతో కూడిన ముగ్గులు ఏర్పాటు చేశారు. చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఒకరికిఒకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

● తాడేపల్లిగూడెం రూరల్: ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ క్యాంపు కార్యాలయం వద్ద నూతన సంవత్సర వేడుకలు జరిగాయి. అధికారులు, నాయకులు భారీగా హాజరై ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

● ఉండి: ఎమ్మెల్యే మంతెన రామరాజు, మాజీ ఎమ్మెల్యే వేటుకూరి వెంకట శివరామరాజు, నరసాపురం ఎంపీ కనుమూరు రఘు కుమారుడు భరత్‌ల కార్యాలయాలు వద్ద నూతన సంవత్సరం వేడుకలను ఘనంగా నిర్వహించారు. టీడీపీ నేతలు, కార్యకర్తలు, తెలుగు మహిళలు పెద్దసంఖ్యలో తరలి వెళ్లి నూతన సంవత్సర గ్రీటింగ్స్ తెలిపారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పొత్తూరి వెంకటేశ్వరరాజు, మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ సాగిరాజు సాంబశివరాజు, కరిమెరక నాగరాజు, కిన్నెర వెంకన్న, కునుకు రమాదేవిశ్రీను, జత్తుగ శ్రీను, వనిమా శ్రీను, కాగిత బుజ్జి పాల్గొన్నారు. మహదేవపట్నంలో జనసేన ఇన్‌చార్జి జుత్తుగ నాగరాజు ఇంటి వద్ద నూతన సంవత్సరం వేడుకలను ఘనంగా జరిపారు. జనసేన, టీడీపీ నేతలు శుభాకాంక్షలు తెలిపారు. ప్రెస్‌క్లబ్ నాయకులు వెంకట, యాకోబురాజు, అంజిబాబు, మణి, అప్పారావు నేతలకు శుభాకాంక్షలు అందించారు.

● పాలకొల్లు: మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్‌కు టీడీపీ శ్రేణులు పుష్పగుచ్ఛాలు, బొక్కేలు అందచేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అంగర మట్లాడుతూ, ఏడాది అంతా ప్రజలకు మేలు జరగాలని కోరారు. అన్నివర్గాల ప్రజలు మద్దతుతో రానున్న రోజుల్లో టీడీపీ, జనసేన కూటమి ప్రభుత్వం ఏర్పడనుందన్నారు. ముందుగా కేక్ కట్‌చేసి అందరికీ పంచారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పెచ్చెట్టి బాబు, గండేటి వెంకటేశ్వరరావు, గొట్టుముక్కల సూర్యనారాయణరాజు, మామిడిశెట్టి పెద్దిరాజు, కోడి విజయభాస్కర్ పాల్గొన్నారు.

● భీమవరంటౌన్: ప్రజలు సంతోషంగా ఉండాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. క్యాంపు కార్యాలయంలో ఆయన అభిమానులు, పార్టీ నాయకులు కేక్ కట్ చేయించారు. వేలాది మంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. మావుళ్ళమ్మదేవస్థానం అర్చకులు ఆశీర్వచనాలు చేసి ప్రసాదాన్ని అందజేశారు. ఇవో యర్రంశెట్టిభద్రాజీ, ఛైర్మన్ మానేపల్లి నాగన్నబాబు, ధర్మకర్తలు ఉన్నారు. సర్కిల్ పోలీసులు, మునిసిపల్, రెవెన్యూశాఖలతోపాటు పలువురు అధికారులు శుభాకాంక్షలు తెలిపారు.

జనసేన కార్యాలయంలో..

జనసేన పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా ఉమ్మడి అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు(చినబాబు)కు పలువురు నాయకులు, అభిమానులు శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా కార్యదర్శి చెనమల్ల చంద్రశేఖర్, సుంకర రవి, సూర్యప్రకాష్, రామాయణం శ్రీనివాస్ ఉన్నారు. మాజీ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) నివాసంలో పెద్ద సంఖ్యలో టీడీపీ అభిమానులు శుభాకాంక్షలు తెలిపారు. నరసాపురం ఎంపీ కనుమూరి రఘురామకృష్ణంరాజు నివాసంలో కుమారుడు భరత్‌కు వైసీపీ, టీడీపీ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజలు సుభిక్షంగా ఉండాలి: బొలిశెట్టి

● తాడేపల్లిగూడెం రూరల్: నియోజకవర్గంలో ప్రజలు సుభిక్షంగా ఉండాలని, సంక్షేమం, అభివృద్ధి కలగలిపిన పాలన అందించేందుకు రాబోయే ఎన్నికలు నాంది పలుకుతాయని నియోజకవర్గ ఇన్‌చార్జ్ బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. పార్టీ కార్యాలయం వద్ద జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు బొలిశెట్టికి శుక్షాకాంక్షలు తెలిపారు. తొలుత బలుసలమ్మకు పూజలు చేశారు.







కాళ్లలో కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే శివరామరాజు, నరసాపురంలో పొత్తూరి రామరాజు.. ఉండి జనసేన ఇన్‌చార్జి జుత్తుగ నాగరాజుకు శుభాకాంక్షలు



నాగేశ్వరరావుకు శుభాకాంక్షలు తెలుపుతున్న నేతలు

ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలి

భీమవరం అర్బన్, జనవరి 1: నూతన సంవత్సరంలో ప్రజలందరూ ఆనందం, ఆరోగ్యం, సుఖ సంతోషాలతో ఉండాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోళ్ళ నాగేశ్వరరావు అన్నారు. రాయలంలోని తన నివాసంలో సోమవారం పేద మహిళలకు చీరెలు పంపిణీ చేశారు. వేంద్ర శ్రీనివాస్, గంటా త్రిమూర్తులు, అబ్బులు, నాగబాబు, చలబోయిన గోవింద్ పాల్గొన్నారు.

● ఆకివీడు: టీడీపీ మండలాధ్యక్షుడు మోటుపల్లి రామవర ప్రసాద్ పార్టీ కార్యాలయంలో కేకు కట్‌చేశారు. దేవాలయాలు కిటకిటలాడాయి.వెంకట్రావు, గంధం ఉమా, వీరశ్వేత, అరుణకుమారి, సత్యవతి, సరళాకుమారి ఉన్నారు.



ఆరిమిల్లికి అభిమానుల శుభాకాంక్షలు

అందరూ అభివృద్ధి సాధించాలి: ఆరిమిల్లి

● తణుకు: నియోజకవర్గంలో ప్రజలంతా అభివృద్ధి సాధించాలని మాజీ ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ కోరారు. సోమవారం తన నివాసంలో కొత్త సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. పెద్ద ఎత్తున టీడీపీ, జనసేన కార్యకర్తలు, నాయకులు విచ్చేసి శుభాకాంక్షలు తెలిపారు. తొలుత ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జనసేన ఇన్‌చార్జి విడివాడ రామచంద్రరావు నివాసం వద్ద జరిగిన వేడుకల్లో జనసేన, టీడీపీ శ్రేణులు శుభాకాంక్షలు తెలిపారు.



వలవల బాబ్జికి శుభాకాంక్షలు

అరాచక పాలనకు చరమగీతం: వలవల

తాడేపల్లిగూడెం అర్బన్, జనవరి 1: వైసీపీ అరాచక పాలనకు చరమగీతం పాడాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. నూతన సంవత్సర వేడుకలను బాబ్జి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అన్నవరం, రాంపండు, వెంకట్రావు, రవికుమార్, సతీష్, అప్పన్న పాల్గొన్నారు.

కేంద్ర పథకాలు సద్వినియోగం చేసుకోవాలి



గ్యాస్ కనక్షన్లను పంపిణీ చేస్తున్న యర్రంశెట్టి పద్మారావు

పోడూరు, జనవరి 1: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జ్ యర్రంశెట్టి పద్మారావు కోరారు. జిన్నూరులో సర్పంచ్ జమ్ము బేబీ మహాలక్ష్మి అధ్యక్షతన జరిగిన వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో ఆయన పాల్గొని మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఉన్న పేదబలహీన వర్గాల ప్రజలకు 18 రకాల పథకాలను అందిస్తున్నామన్నారు. గ్రామీణప్రాంతాల్లో సభలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. మండలంలో 715 కుటుంబాలకు గ్యాస్ కనక్షన్లను అందచేశారు. ఎస్.బదిరీనారాయణరాజు, ఎంపీడీవో డి.సుహాసిని, హౌసింగ్ ఏఈ వెంకట్రాజు, ఆర్‌డబ్ల్యుఎస్ జేఈ బుజ్జేశ్వరరావు, ఇవోఆర్డీ ఎం.బలరామరాజు, కార్యదర్శి వల్లభు రాంబాబు పాల్గొన్నారు.

సొసైటీ క్యాలెండర్ ఆవిష్కరణ

ఆచంట, జనవరి 1: తూర్పుపాలెంలోని క్యాంప్ కార్యాలయం వద్ద వల్లూరు సొసైటీ క్యాలెండర్‌ను ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాధరాజు సోమవారం ఆవిష్కరించారు. సొసైటీ ఛైర్మన్ నారిన బాబులు, ఏఎంసీ ఛైర్మన్ చిల్లే లావణ్య, సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

పండుగల పవిత్రతను కాపాడుకోవాలి

ఆచంట, జనవరి 1: తెలుగు సంస్కృతి సంప్రదాయాలు ఉట్టిపడే విధంగా పండుగ పవిత్రతను కాపాడుకోవాల్సిన అవసరం మనందరిపై ఉందని చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు కొల్లేపర వెంకన్నబాబు అన్నారు. ఆచంట లో సోమవారం నూతన సంవత్సరం, సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకని కొల్లేపర రామారావు ఆయన కుమారుడు వెంకన్నబాబు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈవో రామచంద్రకుమార్, సత్యనారాయణ, పద్మ, దేవస్థానం మాజీ ఛైర్మన్ వేమన అప్పారావు పాల్గొన్నారు.

చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు



ప్రార్థనలు చేస్తున్న విశ్వాసులు

ఉండి, జనవరి 1: నూతన సంవత్సరంలో ప్రభువైన ఏసుక్రీస్తు ప్రజలందరిని ఆశీర్వదించాలని సంఘస్థులు, పాస్టర్లు నెహ్రూ, కరుణాకరరావు ప్రార్థనలు చేశారు. ఎస్ఆర్‌పిఅగ్రహారం చర్చిలో నూతన సంవత్సర వేడుకలను పురష్కరించుకుని భారీ కేక్‌ను కట్ చేశారు. ఉండి, చెరుకువాడ, ఎస్ఆర్‌పిఅగ్రహారం, మహదేవపట్నం, యండగండి, కోలమూరు, ఉణుదుర్రు, పాందువ్వ, వెలివర్రు, చిలుకూరుల్లో నిర్వహించిన ప్రార్థనల్లో యువతీయువకులు, ,పెద్దలు, చిన్నారులు పాల్గొన్నారు. నూతన సంవత్సర పాటలను ఆలపించారు.

కాళ్ళకూరు వెంకన్న ఆలయానికి విరాళాలు



కాళ్ళ, జనవరి 1 : కాళ్ళకూరు వేంకటేశ్వరస్వామి ఆలయ అన్నదాన భవనానికి పలువురు విరాళాలు అందించినట్టు ఈవో మోకా అరుణ్‌కుమార్ సోమవారం తెలిపారు. కాళ్ళకూరుకు చెందిన యతిరాజు గోష్టి (మహిళా భక్త బృందం) శాశ్వత నిత్యాన్నదాన పథకానికి రూ.1లక్ష, అన్నదాన భవనానికి రూ.50వేలు అందించినట్లు చెప్పారు. నంబూరి సత్యనారాయణరాజు (రాజులపాలెం) జ్ఞాపకార్థం వారి సతీమణి అన్నపూర్ణ కుమారులు దుర్గ సత్యనారాయణరాజు, సురేష్‌రాజు నిత్యాన్నదాన పథకానికి రూ.25వేలు, భవన నిర్మాణానికి రూ.50వేలు విరాళం అందించినట్లు వివరించారు.

మహిళలకు ఆర్థిక సాయం

ఆచంట, జనవరి 1: పోడూరు మండలం తూర్పుపాలెం క్యాంప్ కార్యాలయంలో మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాధరాజు మహిళలకు ఆర్థిక సాయం సోమవారం అందజేశారు. జగనన్న ఇళ్ల లేఅవుట్ లో ఇళ్లు నిర్మించుకున్న నిరుపేదలైన తొమ్మిది మంది లబ్ధిదారులకు చీరలు పంపిణీ చేశారు. పేద కుటుంబాలకు అండగా ఉంటానని అధైర్యపడవద్దన్నారు.

అయోధ్య రాముడి అక్షింతలు పంపిణీ



ప్రజలకు పంపిణీ చేస్తున్న అక్షింతలు

ఆకివీడు, జనవరి 1: అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలు, రాముడి కరపత్రాలు, రక్షణ కంకణాలు సోమవారం భక్తులు ఇంటింటికీ తిరిగి పంపిణీ చేశారు. ప్రముఖ్ సన్నిధి మాణిక్యాలరావు, పద్మ, మమత, మల్లేశ్వరి, లక్ష్మి, శ్రీదేవి, గీత, పెద్దింట్లు, పద్మ, లక్ష్మి పాల్గొన్నారు.



యలమంచిలిలో...

● యలమంచిలి, జనవరి 1: రామజన్మభూమి అయోధ్యలో శ్రీరామమందిరం నుంచి వచ్చిన శ్రీరాములవారి పూజిత అక్షింతలను గ్రామంలో భక్తులు సోమవారం ఇంటింటికీ పంపిణీ చేశారు. తొలుత స్థానిక కేశవస్వామివారి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని, అక్షింతలను పల్లకిలో గ్రామవీధుల్లో ఊరేగింపు నిర్వహిం చారు. కాషాయ జెండాలు చేతబట్టిన భక్తులు చేసిన జై శ్రీరామ్ నినాదాలతో వీధులు మార్మోగాయి. భక్తులు ఇంటింటికీ వెళ్లి శ్రీరాములవారి పూజిత అక్షింతలు, కరపత్రాలు, అయోధ్య రామమందిరం చిత్రపటాలను అందజేశారు. చిలుకూరి ఆంజనేయులు,వాడపల్లి గోపి భక్తులు పాల్గొన్నారు.



వీరవాసరంలో అక్షింతలు అందజేస్తున్న విశ్వహిందూ పరిషత్ సభ్యులు

● వీరవాసరం : ఆలయాలకు, అయోధ్య నుంచి వచ్చిన శ్రీరామ పూజ అక్షింతలు పంపిణీ చేశారు. సోమవారం వీరవాసరంలోని సీతారామ స్వామి దేవస్థానం నుంచి గ్రామంలోని వివిధ ఆలయాలకు వీటిని అందజేశారు. రెడ్డి చినసన్యాసిరావు, నౌడు హరిబాబు, ఆకాశపు శ్రీను, మద్దాల అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.



పోడూరులో..

● పాలకొల్లు రూరల్: పాలమూరు గ్రామంలో సోమవారం విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో అయోధ్య రామయ్య పూజిత అక్షింతలను మహిళలకు, యువతకు, భక్తులకు పంపిణీ చేశారు. ఈఅక్షింతలుతో పాటు సాంప్రదాయ పద్ధతిలో పసుపు, కుంకుమ, చలివిడి, మూడు రకాల స్వీట్లు, పండ్లు అందజేశారు. ఈకార్యక్రమంలో విశ్వహిందూ పరషత్ నిర్వాహకులు అడ్డాల సూరిబాబు, పంచదార నారాయణస్వామినాయుడు, నాగేశ్వరరావు, దర్మారావు రంగారావు, గుత్తుల బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

పుంతలో ముసలమ్మ ఉత్సవాలు ప్రారంభం



తాడేపల్లిగూడెం రూరల్, జనవరి 1: తాడేపల్లిగూడెం సీతారాంపేటలోని పుంతలో ముసలమ్మ ఉత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభించారు. అమ్మవారికి మేలుకొలుపు, మంగళస్నానం, సుప్రభాతసేవ, విశేష పూజలు నిర్వహించారు. ఉత్సవ కమిటీ ఛైర్మన్ రాజా త్రినాథ్, కమిటి సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

శైవక్షేత్రాలు కిటకిట



మొగల్తూరు, జనవరి 1:నూతన సంవత్సరం ఆరంభం సోమవారం కావడంతో మండలంలోని శైవ క్షేత్రాలు కిటకిటలాడాయి. మొగల్తూరులోని పురాతన పార్వతీ విశ్వేశ్వరస్వామి, వడయార్‌పేటలోని స్వయంభూ లింగేశ్వర వనమల్లిఖార్జుని ఆలయం, కాళీపట్నం బద్రకాళీ సమేత కాళికేశ్వరస్వామి ఆలయం, ముత్యాలపల్లిలోని భవనేశ్వరీ సమేత ముక్తేశ్వరస్వామి ఆలయం, పేరుపాలెం, కొత్తపాలెం గ్రామాల్లోని చంద్రమౌళేశ్వర స్వామి ఆలయాల్లో వేకువ జామునుండే భక్తులు భారీగా తరలివచ్చి స్వామి వార్లను దర్శించుకుని అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు.




కేక్ కట్‌చేస్తున్న కలెక్టర్ ప్రశాంతి

అధికారులు తమకున్న అవకాశాన్ని

సద్వినియోగంచేసుకోవాలి

భీమవరం, జనవరి 1 : అధికారులకు తమకున్న అవకాశాన్ని వినియోగించి, ప్రజలకు మంచి సేవలను అందించాలని కలెక్టర్ పి.ప్రశాంతి కోరారు. కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో సోమవారం నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ కుమార్తె సిరి చందన, జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్ సుందర్ రెడ్డి ఆయన సతీమణి ప్రసన్నలతో కలిసి కేక్ కట్ చేశారు. అనంతరం ఎస్పీ యు. రవిప్రకాశ్, డీఆర్ఓ ఎం.శివన్నారాయణ రెడ్డి, కలెక్టరేట్ పరిపాలన అధికారి వైకె.వి. అప్పారావు, వివిధ శాఖల జిల్లా, మండల స్థాయి అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, పెద్దఎత్తున ప్రజలు కలెక్టర్ కు పుష్పగుచ్ఛాలు, పండ్లు, బొకేలు అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. అధికారులు కష్టపడి పనిచేసి లక్ష్యాలను నెరవేర్చాలన్నారు. తొలుత వేద పండితులాశీర్వచనం తీసుకున్నారు. అనంతరం రెవిన్యూ అసోసియేషన్ డైరీని, క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఆర్డీవోలు కె.శ్రీని వాసులురాజు, ఎం. అచ్యుత్ అంబరీష్, కే చెన్నయ్య, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ కె.సంగీత్ మాథుర్, సివిల్ సప్లైస్ జిల్లా మేనేజర్ టి.శివ రామ ప్రసాద్, డిపి ఆర్ఓ టి. నాగేశ్వరరావు, జిల్లా వ్యవసాయశాఖఅధికారి జెడ్.వెంకటేశ్వరరావు, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ నాగేంద్ర ప్రసాద్, డీఎస్ఓ ఎన్.సరోజ, డీపీవో జీవీకే మల్లికార్జునరావు, డీఆర్‌డీఏ పీడీ శివప్రసాద్ యాదవ్, డీఎఫ్ఓ బి. శ్రీనివాసరావు, డ్వామా పీడీ ఎస్.టి.వి రాజేశ్వరరావు, ఐసిడిఎస్‌పిడి బి.సుజాత రాణి, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి కె.శోభారాణి, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులు, స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

జిల్లా ప్రజలకు జేసీ నూతన సంవత్సర శుభాకాంక్షలు



జేసీకి శుభాకాంక్షలు తెలుపుతున్న అధికారులు

భీమవరం, జనవరి 1 :జిల్లా ప్రజలకు జాయింట్ కలెక్టర్ పి.రామ సుందర రెడ్డి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం జేసీ క్యాంప్ కార్యాలయంలో అధికారులు, ఉద్యోగుల సమక్షంలో భారీ కేక్ కట్ చేశారు. జేసీకి పలువురు పూలబోకేలు ఇచ్చి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా, మండల వివిధ శాఖలు అధికారులు,చిరుద్యోగులు, జిల్లా రైస్ మిల్లర్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం



కలిగొట్లలో వారధిని పరిశీలిస్తున్న భరత్

ఉండి, జనవరి 1: అభివృద్ధే అజెండగా తన తండ్రి నరసాపురం ఎంపీ కనుమూరు రఘురామ కృష్ణంరాజు పని చేస్తున్నారని దీనిని ప్రజలంతా గమనించాలని ఎంపీ కుమారుడు భరత్ అన్నారు. హైదరాబాదులో వున్నా ఢిల్లీలో వున్నా ఆయన దృష్టి అంతా నియోజకవర్గంలోని అభివృద్ధి, ప్రజలపైనే వుందన్నారు. పార్లమెంటు పరిధిలో ఎన్నో గ్రామాలకు కోట్లాది రూపాయల నిధులు డ్రైయినేజీ, సీసీ రహదారులు, మంచినీటి సౌకర్యాలు, కమ్యూనిటీ హాల్సు, వంతెనలకు మంజూరు చేశారన్నారు. అభివృద్ధి పనులు ప్రారంభిం చడం ఆనందంగా వుందన్నారు. అభివృద్ధి కోసమే తాము పనిచేస్తామన్నారు. కలిగొట్లలో ఇటీవలే వెంకయ్యవయ్యే కాలువపై స్థానికరైతులు, ప్రజలు దాతలు ముందుకు వచ్చి నిర్మించుకుని ప్రారంభించిన వారధిని పరిశీలించారు. భరత్‌ను ఎమ్మెల్యే రామరాజు చేతుల మీదుగా ఘనంగా సన్మానించారు.

ఎంపీ సహకారం మరువలేం: ఎమ్మెల్యే రామరాజు

నరసాపురం పార్లమెంటు సభ్యుడు కనుమూరు రఘురామరాజు ఉండి నియోజకవర్గంలోని పలు గ్రామాలకు మంజూరుచేసిన నిధులతో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయన్నారు. యువరాజు, సీతారామరాజు, యశోద కృష్ణ, తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.